# గబ్బి

'వీర గంధము తెచ్చినారము వీరు లెవ్వరో తెల్పుడీ.....'

మాకోడలు వాళ్ళ ఆఫీసు బాస్ కోసం ఎదురుచూస్తూంటే ఆ గేయం ఎందుకు గుర్తొచ్చిందో తెలీదు. ఊరికే నాలిక మీద ఆడుతోంటే సదరు ఆఫీసరుగారి పండు ఎరుపు రంగు కారు కోసం ఎదురు చూస్తూ నిలబడ్డాను.

పన్నెండోసారి మా కోడలు ఫోన్ చేసింది "వచ్చేరా?"

"ఇంకా రాలేదు"

"మీరా మలుపులోనే ఉన్నారు కదా?"

"నువ్వు చెప్పిన చోటే జెండా కొయ్యలా నిలబడ్డాను"

"వచ్చేస్తూంటారు ఇంకెటూ అడుగెయ్యకండి. ఆయన వీఐపీ ఏవిటనుకున్నారో!"

"ఏవీ అనుకోలేదు. చూశాక అనుకుంటానేమో!"

మరి రెండు ఫోన్లయ్యాక చిన్నకారులో దర్జాగా వచ్చారు బాస్. నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"ఓహో బతకలేని బడి పంతులా!"

'కాదు. బతుకు నేర్పేవాడ్ని' నాలిక చివరి దాకా వచ్చింది కాని మింగేశాను.

"ఇల్లెక్కడ?"

"అదిగో ఆ బిల్డింగే నండి....."

కారు దూసుకెళ్ళింది దుమ్ము రేపుతూ. పరుగులాంటి నడకతో వెనకే వెళ్ళి కలుసుకున్నాను.

భారీ శరీరాన్ని కష్టంగా కార్లోంచి బయటికి తీసి విసుగ్గా చూశారు నావంక - అదేదో నా తప్పైనట్టు!

"లిఫ్టు అక్కడ వుంది సార్"

అవాళ్టి తెల్లవారు జామునే మా అబ్బాయీ కోడలూ కొత్త ఫ్లాట్‌లోకి గృహ ప్రవేశం చేశారు. మా అబ్బాయి ప్రైవేటు కంపెనీలో చిరుద్యోగి. మా కోడలు ఆర్ అండ్ బీలో ఆఫీసర్ పి.ఏ. ఏవో తంటాలు పడి బ్యాంకు లోనూ అక్కడా ఇక్కడా చేబదుళ్ళు తీసుకునీ ఇరవై లక్షలకి ఈ ఫ్లాట్ కొన్నారు.

పాతికేళ్ళ నుంచి టీచర్‌గా పని చేస్తున్నా నేనింకా అద్దె ఇంట్లోనే అఘోరిస్తున్నాను. మావాడప్పుడే ప్రయోజకుడయ్యాడు. నిజం చెప్పాలంటే కోడలు పిల్ల మహా చురుకు!

మూడో అంతస్తులో కెళ్ళాం. షూస్ బయట విప్పి సాక్స్‌తో ఫ్లాట్‌లోకి నడిచారు బాస్. మా అబ్బాయీ కోడలూ ఎదురొచ్చి ఆయనకి పాదాభివందనం చేశారు. పిమ్మట ఇల్లు చూపిస్తోంటే వారి వెనకే వెళ్ళాను.

ఏదో దుర్గంధం నా నాసికా పుటాలకి తగిలింది. హాలు నలుమూలలా పరికించి చూశాను. ఎక్కడ్నుంచి వస్తోందో తెలీలేదు. బెడ్ రూం, కిచెన్, మరో బెడ్ రూం అన్నిట్లోకీ బాస్ వెనకాలే వెళ్ళిన అన్ని చోట్లా అదే వాసన. కడుపులో దేవింది.

'ఆయనేమనుకుంటాడో!' అని కిటికీ తలుపులు తెరచి ఫ్యాన్లు వేశాను. ఒకరిద్దరు ముక్కు లెగరెయ్యడం తుమ్మడం మొదలెట్టారు.

"సాంబ్రాణి పొగవెయ్యవే. కనీసం నాలుగు అగరొత్తులు వెలిగించి పెట్టు వాసన భరించలేకపోతున్నాం" అన్నాను మా ఆవిడతో.

"మీరు మరీనూ! ఎవరో ఏదో తొక్కి వచ్చి వుంటారు. ఏమైనా అంటే బాగోదు. కాస్సేపటికదే పోతుంది లెండి" అందామె.

బాస్‌కి గదిలో ప్రత్యేకంగా భోజన ఏర్పాటు చేసి అన్నీ అమరుస్తూ హడావిడి పడుతున్నారు అబ్బాయీ కోడలూ. బంధువులు చిత్రంగా చూస్తున్నా పట్టించుకోలేదు.

"అందర్తో బాటు డాబాపైన కుర్చీ వేసి వడ్డించక పోయారా" అన్నాను ఇబ్బందిగా చూస్తూ.

"ష..... ఆయనకి చికెన్ లేకపోతే ముద్ద దిగదు. ఆఖరికి ఇడ్లీ కూడా చికెన్ కర్రీలో నంజుకుని తింటారు. అందుకని నాలుగు రకాల చికెన్ కర్రీలు హొటల్నుంచి తెప్పించాను....."

"ఇవతల సత్యనారాయణ స్వామి వ్రతం చేసుకుని....."

"ఏం ఫరవా లేదు. బాస్ ఖుష్ అయితే చాలు. మేమీ ఫ్లాట్ కొనుక్కోగలిగామంటే అదంతా ఆయన చలవే" అంది కోడలు ఆయన్ని మించిన భగవంతుడు ఉండడన్నట్టుగా హావభావాలు ప్రదర్శిస్తూ.

ఆయన భోజనం పూర్తయింది. ఆయన్ని సాగనంపడానికెళ్తూ "కొంచెం గదిలోవి సర్దేసెయ్ నాన్నా ఎవరైనా చూస్తే బాగోదు" అన్నాడు మావాడు.

గదిలోకి అడుగు పెట్టిన వాడ్నల్లా వాంతి చేసుకోబోయి బయటి కొచ్చేశాను. గదినిండా దుర్వాసనే!

బాస్ ఇంతసేపూ ఈ గదిలో ఎలా వున్నారో ఎలా తిన్నారో దేవుడికే ఎరుక!

ముక్కు మూసుకుని అక్కడ్నుంచి వచ్చేస్తోంటే, "అతగాడి సాక్సు వాసనండీ. ఎప్పుడు ఉతికారో ఏమో!" అంది శ్రీమతి నా చెవిలో.

అంతపెద్ద ఆఫీసరు ఇంత చిన్న విషయం ఎందుకు పట్టించుకోడో! కొత్త ఇంటికి గబ్బు పట్టించాడు!

మేం డాబా మీది కెళ్ళి భోంచెయ్యబోతోంటే ముగ్గురు అధికార్లు గబగబా వచ్చారు. మా కోడల్ని ప్రశ్నించడానికొచ్చామన్నారు అధికారదర్పంతో.

"ఆవిడ గవర్నమెంటు సర్వెంటండీ"

"అందుకనే వచ్చాం. ఆవిడ్ని రమ్మనండి"

"ఇవాళే గృహప్రవేశం చేశారు. ఇంటి నిండా బంధుమిత్రులున్నారు....."

"సారీ. మా డ్యూటీకి అడ్డు రాకండి....."

మరి మాట్లాడలేక పోయాను. అతిథులూ కొయ్యబారి పోయారు.

కొత్త ఫ్లాట్ హాలు మధ్యలో మా కోడల్ని నిలబెట్టి నలువైపుల్నుంచీ శరపరంపర సంధించారు.

"ఫ్లాట్ ఎలా కొన్నారు? డబ్బు ఎక్కడెక్కడ్నుంచి ఎలా తెచ్చారు? అన్ని ఆధారాలూ చూపించండి" అని పీకల మీద కూర్చున్నారు.

మా కోడలు ఏడ్చేసింది. వాళ్ళు వదలకపోయే సరికి మెల్లగా తేరుకుని ఒక్కొక్కటిగా గుట్టుమట్లు విప్పింది.

కాంట్రాక్టర్ల నుండి పెర్సంటేజీలు తీసుకుని ఆఫీసులోని ముఖ్యులు పంచుకుంటార్ట. బాస్‌ది పెద్దవాటా. ఆయన అవినీతి పనుల్లో సహకరించే మా కోడల్లాంటి వారికి చిన్న వాటాలట. ఆ చిన్న వాటాలతోనే ఇంత ఖరీదైన ఫ్లాట్ కొన్నారంటే ఇంక బాస్.....?

"చిన్న చేపలతో బాటు తిమింగలాన్నీ వదలకండి" నా మాటలకంతా అవాక్కై చూశారు.

"బాస్‌ని అరెస్టు చెయ్యడానికి ఇంకో బృందం వెళ్లింది" వారి మాటలు వింటూనే షేక్ హేండిచ్చాను.

హఠాత్తుగా చెడువాసన ఇంటి నలువైపుల్నుంచీ రాసాగింది. ఇది ఖచ్చితంగా ఉతకని సాక్సుల వాసన కాదు. జాతి మూలుగుల్ని పీలుస్తోన్న దుర్గంధం!

గబగబా ఇంట్లోంచి బయటపడి, "ఏమేవ్!. మన బట్టలు సర్దు వెళ్ళి పోదాం...." అన్నాను శ్రీమతితో.

"మీకు మతి పోయిందా. ఇటువంటి పరిస్థితుల్లో వీళ్ళనిలా వదిలి....."

"చేసుకున్న వాళ్ళకి చేసుకున్నంత మహదేవ అన్నారు. ఈ ఇంట్లోని అవినీతిగబ్బుని భరించి వుండటం నాకు సాధ్యం కాదు..... మన బ్యాగ్గులు తీసుకురా నడుస్తూంటా.....!"

**(స్వప్న మాసపత్రిక సెప్టెంబరు 2011)**